క్లుప్తంగా

సమస్యలను పరిష్కరిస్తాం

కర్నూలు(రూరల్): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందజేసిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని ఎమెల్యే బొగ్గుల దస్తగిరి హామీ ఇచ్చారు. మండలంలోని పసుపల గ్రామంలో బుధవారం ఎమెల్యే క్యాంప్ కార్యలయంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని అర్జీలు స్వీకరించారు.

మారని చర్మకారుల జీవితాలు

కోడుమూరు రూరల్: తరాలు మారినా చర్మకార వృత్తిదారుల జీవితాలు మారడం లేదని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పెద్దబాబు వాపోయారు. బుధవారం గూడూరులో చర్మకార వృత్తిదారుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా చెప్పులు కుట్టే చర్మకార వృత్తిదారుల జీవితాలు మాత్రం మారడం లేదన్నారు.వారి సంక్షేమం కోసం ప్రభుత్వాలు స్పందించడం లేదని మండిపడ్డారు. ఇకనైనా వారికి సంక్షేమ పథకాలను అందించడంతో పాటు, జీవించడానికి రెండెకరాల పొలం, ఆరోగ్య బీమా,నెలకు రూ.8వేల పింఛన్ అందజేయా లని డిమాండ్ చేశారు. అనంతరం గూడూరు చర్మకార వృత్తిదారుల సంఘం కమిటీని ఏకగ్రీవ ంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా కార్యదర్శి ఆంటోని, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్, కేవీపీఎస్ పట్టణ అధ్యక్షులు దానమన్న పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన ఉండాలి

సి.బెళగల్: చిన్నారుల్లో ఆటిజం సమస్యలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని స్థానిక రెగ్యులర్ స్కూల్ హెచ్ఎం కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక భవిత కేంద్రం ఐఈఆర్‌టీలు మద్దిలేటి, సోమశేఖర్‌రెడ్డి ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ..చిన్నారుల్లో ఏర్పడే ఆటిజం సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధతో పాటు సత్వరం గుర్తించి, చికిత్స ఇప్పిస్తే సమస్యలు ఉండవని చెప్పారు.

విజయవంతం చేయండి

కర్నూలు (రూరల్): ఈనెల 4వ తేదీన విజయవాడలో జరిగే ఆర్యవైశ్య సమ్మేళనంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడలోని కన్వెన్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి టీజీ. భరత్ హాజరవుతారని చెప్పారు. ఆర్యవైశ్యులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

రుణాలను జీవనోపాధులుగా మలుచుకోవాలి

సి.బెళగల్: పొదుపు మహిళలు బ్యాంక్‌ల ద్వారా పొందే రుణాలను జీవనోపాధులుగా మలుచుకోవాలని వెలుగు ఏపీఎం రామేశ్వర్ తెలిపారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో పొదుపు మహిళలకు జీవనోపాధులపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, మండలంలోని పొదుపు మహిళలకు మూడు రోజుల పాటు జీవనోపాధులపై శిక్షణ ఇస్తామన్నారు. రుణాలతో పెరటి కోళ్ల పెంపకం, డైరీ ఫాంల నిర్వహణ, కుటీర పరిశ్రమల ఏర్పాటు, కిరాణ దుకాణాలు, హోటళ్లను ఏర్పాటు చేసుకుని కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. సీసీలు శ్రీనివాసులు, రాముడు, గుండమయ్య ఉన్నారు.

సంచార వైద్య శిబిరం తనిఖీ



శిశువును పరిశీలిస్తున్న నోడల్ అధికారి డాక్టర్ రఘు

కర్నూలు(రూరల్): మండలంలోని గార్గేయపురం పాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పడిదెంపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన సంచార వైద్య శిబిరాన్ని నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు తనిఖీ చేశారు. అయన మాట్లడుతూ గర్భిణులు, పిల్లలకు సకాలంలో టీకాలు వేస్తున్నారా, మాత్రలు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా అనేది తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రల్లో ఇచ్చే భోజనం తినిపిస్తే పిల్లలు బాగా ఎదుగుతారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అబ్దుల్ అనిద్, ఆరోగ్య విస్తారణాధికారి వెంకట రమణ, వెద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పట్టించుకునే వారేరీ?

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వ పాలనలో రైతుల సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని సీపీఐ మండల కార్యదర్శి రాజు విమర్శించారు. బుధవారం కోడుమూరులోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జాతీయ మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. రాజు మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తే మార్కెట్లో గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల పాలవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతన్నలు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారని, వ్యవసాయాన్ని వదిలేసే పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. రైతాంగ సమస్యలపై చర్చించేందుకు ఈనెల 15,16,17వ తేదీల్లో తమిళనాడులోని నాగపట్నంలో జాతీయ రైతు మహాసభలను, ఈనెల 4న కర్నూలులో ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తామని జయప్రదం చేయాలని రాజు కోరారు. రాముడు, బజారి, సుంకన్న, వీరప్ప, లక్ష్మన్న పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓ తనిఖీ



యూపీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శాంతికళ బుధవారం నగరంలోని శరీన్‌నగర్ యూపీహెచ్‌సీని తనిఖీ చేశారు. అక్కడి ఓపీ గది, వ్యాక్సిన్ నిల్వ గది, ల్యాబ్, స్కానింగ్ గది, మందుల గదులను తనిఖీ చేసి రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతిరోజూ వంద మందికి ఓపీ సేవలు అందించాలని, ఆ వివరాలను డాక్టర్ కేర్ పోర్టల్‌లోని ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఓఆర్ఎస్ కార్నర్‌ను పరిశీలించారు. ప్రజలు వడదెబ్బకు గురిగాకుండా జాగ్రత్తలు తీసుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సచివాలయ పరిధిలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేసి గర్భిణులు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. డీపీఎంఓ డాక్టర్ ఉమ, వైద్యాధికారి డాక్టర్ ఫర్హీన్ తబ్సుం, డెమో శ్రీనివాసు లు శెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

విజిలెన్స్ దాడులు



ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలో బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ పౌరసరఫరాల అధికారులు రెండో రోజు బుధవారం దాడులు కొనసాగించారు. ముగ్గురు ఎండీయూ ఆపరేటర్లు, రెండు రేషన్ షాపులపై దాడులు చేశారు. ఎండీయూ ఆపరేటర్ సాయి మహేష్ (11వ నంబర్)పై దాడి చేయగా ఉండాల్సిన బియ్యం కన్నా 593 కేజీలు తక్కువగా ఉండడంతోపాటు 164 ప్యాకెట్ల చక్కెర తక్కువగా ఉండడంతో 6ఏ కేసు నమోదు చేశారు. అలాగే రేషన్ షాపు నంబర్ 113పై దాడిచేయగా డీలర్ సుజిత్‌కుమార్ వద్ద ఉండాల్సిన బియ్యం కంటే 86 సంచులు తక్కువగా ఉండడంతో అతనిపై కూడా 6ఏ కేసు నమోదు చేశారు. ఆయా దాడుల్లో డీఎస్‌ఓ రాజారఘువీర్, ఏఎస్‌ఓ రామాంజనేయరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

భరోసా



ఎస్వీ దంపతులను సత్కరిస్తున్న ఎంప్లాయిస్, పెన్షన్ విభాగం అధ్యక్షులు సత్యరాజ్

కర్నూలు (టౌన్): ఏడాది పాలన కూడా గడవకముందే కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత వచ్చింది. వైఎస్సార్‌సీపీ అభ్యున్నతి కోసం కష్టపడి పనిచేద్దాం, కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక గిప్సన్ కాలనీలోని ఎస్వీ స్వగృహంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ కర్నూలు నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షన్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన సత్యరాజు ఆధ్వర్యంలో ఎస్వీ మోహన్ రెడ్డి, సతీమణి విజయమనోహారిలను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, ఎస్వీ యూత్ పాల్గొన్నారు.

నీటి తొట్టె నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(రూరల్): మండలంలోని దిన్నెదేవరపాడు గ్రామ శివారులో పశువుల నీటి తొట్టె నిర్మాణానికి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎమెల్యే బొగ్గుల దస్తాగిరితో కలసి బుధవారం భూమి పూజ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లడుతూ పశువులు,మూగజీవాల దాహార్తి తీర్చేందుకు జిల్లా వ్యాప్తంగా 300 పశువుల నీటి తొట్టెలు మంజూరయ్యాయని తెలిపారు. కర్నూలు మండలానికి 15 నీటి తొట్టెలు మంజూరయ్యాయని చెప్పారు. ఒక తొట్టె నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు రూ.34వేలు కేటాయిస్తున్నామన్నారు. ఈనెల 10 తేదీ లోపు తొట్టెల నిర్మాణలను పూర్తి చేస్తే.. వేసవిలో వీటిని వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. సర్పంచ్ మధవస్వామి, డ్వామా పీడీ వెంకట రమణయ్య, ఎంపీడీఓ రఘునాథ్, రూరల్ తహసీల్దార్ రమేష్ బాబు, ఏపీఓ మధుబాబు, పంచాయతీరాజ్ ఇంజినీర్ ముక్తార్‌బాషా పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు



అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీ పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ వార్డులకు చెందిన పలువురు ఎమ్మెల్యేను కలిసి సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి, పెరుగు పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

● క్రెడాయి నూతన కార్యవర్గం చైర్మన్ జి. రమణ, అధ్యక్షుడు సురేష్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బాలస్వామి, ఇతర సభ్యులు మ్మెల్యే గౌరు చరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డి దంపతులను బుధవారం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బిల్డర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి



02కేఎన్ఎల్26 : సంతకాల సేకరణలో పాల్గొన్న మునిసిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం శ్రీరామ్‌నగర్‌లో ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునిసిపల్ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగులకు రూ.15 వేలు పింఛన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎండీ ఆనంద్‌బాబు

కర్నూలు(సెంట్రల్): ఏపీలోని దివ్యాంగులందరికీ రూ.15 వేలు పెన్షన్ ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజామునెమ్మ, గోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని కౌతాళ మండల కన్వీనర్ ఈరన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగులపై ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు. వ్యవస్థీకృత లోపం కారణంగా అంగవైకల్యంతో పుట్టినా, పుట్టిన తరవాత అధికారులు పట్టించుకోకుండా టీకాలు వేయకపోవడంతో వికలాంగులుగా మారిన వారికి మాత్రం పింఛన్ ఇవ్వడంలో అనేక కొర్రీలు పెడుతున్నారని విమర్శించారు.

బీఎల్ఓలు నిబద్ధతతో పనిచేయాలి

కర్నూలు (టౌన్): బీఎల్ఓలు ఎన్నికల విధులను నిబద్ధతతో నిర్వహించాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు సూచించారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో బీఎల్ఓలతో వార్షిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఫారం 6, 7, 8 లను పూర్తి అవగాహనతో నింపాలని, పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు అవసరమనుకుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. హ్యాండ్‌బుక్‌లో ఉన్న ఎన్నికల విధులు, నిబంధనలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి తహసీల్దారు వెంకటలక్ష్మి, సూపరింటిండెంట్లు మన్సూర్ బాషా, డిప్యూటీ తహసీలారు ధనుంజయ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ఎస్ నరేంద్రకుమార్‌రెడ్డి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ఆటో వర్కర్ యూనియన్‌లో ఉన్న వర్కర్లు, డ్రైవర్లు క్రమశిక్షణతో మెలగాలన్నారు. యూనిఫామ్ ధరించి ప్రయాణికుల పట్ల గౌరవంగా నడుచుకోవాలన్నారు. ఆటోల్లో దొంగ సామాన్లు, నాటుసారా వంటి తరలించరాదన్నారు. లైసెన్స్‌లు కలిగిన వారే ఆటోను నడపాలన్నారు. డ్రైవర్లందరూ కలిసి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్, ఆటో యూనియన్ నాయకులు నాగరాజు, వెంకటరమణ, రాముశేఖర్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఏఓ రవిప్రకాష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాలకు సంబంధించిన స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ దుకాణదారులంతా మార్చి నెల ముగిసిన దృష్ట్యా పాత రిజిష్టర్లను పూర్తి చేసి కొత్త స్టాక్ రిజిష్టర్లను ఏర్పాటు చేసుకుని, స్టాక్ వివరాలను పొందుపర్చాలని సూచించారు. ప్రతి దుకాణదారుడు కూడా కొత్తగా ఏర్పాటు చేసిన స్టాక్ రిజిష్టర్లపై సంతకాలు చేయించుకోవాలని చెప్పారు. రైతులు పొలాల్లో గత పంట అవశేషాలను పూర్తిగా తొలగించి వేసవి దుక్కులకు సిద్ధమవ్వాలని చెప్పారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

పాణ్యం: జాతీయ ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఉమ్మడి జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈపరీక్షకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకున్నారు. మొదటి సెషన్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ పరీక్షలు మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు జరిగాయి. ఉదయం 94మంది గాను 85 మంది, మధ్యాహ్నం 97మందికి గాను 92 మంది హాజరైనట్లు కేంద్రం కన్వీనర్ సుబ్బారెడ్డి తెలిపారు.

ఏపీఓగా శేషన్న

పాణ్యం: మండల ఏపీఓగా శేషన్న బుధవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలో భాగంగా బేతంచెర్ల నుంచి పాణ్యానికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న విజయరాణి బదిలీపై బేతంచెర్లకు వెళ్లారు. ఇదిలా ఉంటే కొత్త ఏపీఓ సిబ్బందితో సమావేశమై ఉపాధి పనుల కల్పనలో లక్ష్యాన్ని సాధించాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను కొనసాగించాలి

కల్లూరు: ఉలిందకొండ ఫీల్డ్ అసిస్టెంట్ శాంతకుమారిని కొనసాగించాలని సీపీఎం మండల కార్యదర్శి కృష్ణ, నాయకులు మధు డిమాండ్ చేశారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి పనుల 17వ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం జరిగింది. ఇందులో సీపీఎం నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఉలిందకొండ ఫీల్డ్ అసిస్టెంట్‌పై కక్ష సాధింపు చర్యలు పెరిగాయన్నారు. ఇందులో భాగంగానే ఆమెపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని ఏపీడీ మాధవిలతకు విన్నవించారు.

వాహనాల తనిఖీ



పాణ్యం దొంగు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ సుధాకర్‌రెడ్డి

పాణ్యం: పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లు పెట్టడాన్ని నిరసిస్తూ ముస్లింలు ఆందోళనలకు దిగుతున్న నేపథ్యంలో పోలీసులు అలర్ట్ అయ్యారు. పలు చోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేశారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పాణ్యంలోని దొంగు వద్ద వాహనాలు తనిఖీ చేసినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి వెల్లడించారు.

ఆటిజంపై అవగాహన



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ జగన్‌మోహన్‌రెడ్డి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని భవిత సెంటర్‌లో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. తల్లి గర్భంలో ఉన్నప్పుడు ఏదైనా వైరస్ ఇన్‌ఫెక్షన్ చేరితే ఆటిజం సమస్యలు తలెత్తుతాయన్నారు. మెదడులో రసాయన మార్పులు కూడా సమస్యకు మూలమన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 3న పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ సబ్‌స్టేషన్ పరిధిలో కిడ్స్ వరల్డ్ పార్క్, అబ్దుల్లాఖాన్ ఎస్టేటు, విద్యానగర్ ఏరియా, ఈశ్వర్‌నగర్ ఏరియా, రివర్‌వ్యూ కాలనీ, యుకాన్‌ప్లాజా ఏరియాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఎన్ఆర్ పేట, సంకల్‌బాగ్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వెల్లడించారు.

ప్రజల దాహార్తి తీర్చుదాం



చలివేంద్రం వద్ద మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: విరివిగా చలి వేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చుదామని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని నన్నూరు బంగ్లా బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రజల రద్దీ ఎక్కువగా ఉన్న చోట చలివేంద్రాలు నెలకొల్పుతున్నట్లు తెలిపారు. ఇందులో గ్రామ నాయకులు, పంచాయతీ అధికారులు భాగస్వాములు కావాలని కోరారు. మండలంలో ప్రధానంగా జాతీయ రహదారి పొడవున ఉండే ఓర్వకల్లు, హుసేనాపురం, నన్నూరు, సోమయాజులపల్లె, పూడిచెర్ల, కాల్వబుగ్గ, గ్రామాలతో పాటు ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, కాల్వ, బ్రాహ్మణపల్లె, శకునాల, మీదివేముల గ్రామాల్లోని బస్సు షెల్టర్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంధి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

లిఫ్ట్ కింద నీటి మడుగు



లిఫ్ట్ కింద ఏర్పడిన నీటి మడుగు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీ వద్ద ఉన్న లిఫ్ట్ కింద నీరు వచ్చి చేరుతోంది. ఈ కారణంగా తరచూ లిఫ్ట్ పనిచేయక మొరాయిస్తోంది. ఒకవేళ పనిచేసినా ఎప్పుడు ఆగిపోతుందో తెలియని అయోమయ పరిస్థితి. ఈ లిఫ్ట్ క్యాజువాలిటీ నుంచి మొదటి అంతస్తులో ఉన్న పలు ఓపీ విభాగాలకు, రెండో అంతస్తులో ఉన్న పరిపాలనా విభాగానికి అనుసంధానంగా ఉంది. లిఫ్ట్ ద్వారానే ప్రజలు, అధికారులు, ఉద్యోగులు, వైద్య సిబ్బంది వెళ్లి వస్తూ ఉంటారు. లిఫ్ట్ కింద నీరు చేరుతుండటంతో తరచూ పనిచేయక ఆగిపోతోంది. నీరు ఎక్కడి నుంచి వస్తుందో తెలియడం లేదు. ఈ నీటి ద్వారా విద్యుదాఘాతం జరిగితే పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఉద్యోగులు, సిబ్బంది, ఆస్పత్రికి వచ్చే ప్రజలు కోరుతున్నారు

– కర్నూలు(హాస్పిటల్)

ఆస్పత్రిపై కేసు నమోదు చేయాలి



ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): అమీలియో ఆస్పత్రి అంబులెన్స్ ఢీకొట్టడంతో కర్నూలు రూరల్ మండలం నిడ్జూరుకు చెందిన నాని అనే వ్యక్తి మృతి చెందాడని, ఇందుకు ఆస్పత్రి యాజమాన్యాన్ని బాధ్యులుగా చేసి కేసు నమోదు చేయాలని కేవీపీఎస్, ఐద్వా జిల్లా కార్యదర్శులు ఎండీ ఆనంద్‌బాబు, అలివేలు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా డిమాండ్ చేశారు. బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. మృతుడు నానికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని వారిని ఆదుకునేందుకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు టి.రాముడు, గురుశేఖర్, రంగనప్ప.. హెస్సేనబాషా పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే సీపీఎం ధ్యేయం



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): సమ సమాజ స్థాపనే సీపీఎం ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు హరిబాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు, ఎండీ ఆనందబాబు పేర్కొన్నారు. బుధవారం కర్నూలులోని సుందరయ్య సర్కిల్‌లో ఏప్రిల్ 2 నుంచి 6వ తేదీ వరకు తమిళనాడులోని మధురైలో జరిగే సీపీఎం 24వ మహాసభలు విజయవంతం కావాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆ పార్టీ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కారు పేదలను పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేటర్లకు కొమ్ము కాస్తూ దేశంలో మత, కుల విద్వేషాలను రేపుతోందని విమర్శించారు. నాయకులు గురుశేఖర్, ఆర్.నరసింహులు, సీహెచ్ సాయిబాబా, కె.సుధాకరప్ప, కె.ప్రభాకర్, ఎస్ఎండీ షరీఫ్, రామకృష్ణ పాల్గొన్నారు.

కేజీబీవీల్లో సీట్లు పెంచాలి

కర్నూలు సిటీ: కస్తూర్బా గాంధీ విద్యాలయా ల్లో చదుకునేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ అడ్మిషన్ లభించేలా సీట్ల సంఖ్య పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప కోరారు. ఈ మేరకు సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ శ్రీనివాసులును బుధవారం ఎస్ఎస్ఏ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరువు నిలయంగా మారిన కర్నూలు జిల్లా నుంచి ఏటా వేలాది కుటుంబాలు బతుకు దెరువు కోసం వలస వెళుతున్నాయన్నారు. వారంతా బాలికలను ఇంటి వద్ద ఉంచలేక చదువును మధ్యలోనే ఆపేసి తమతో పాటు తీసుకెళుతున్నారని వివరించారు. తద్వారా ఎంతో మంది బాలికలు చదువుకు దూరం అవుతున్నారన్నారు. అలాంటి వారందరికీ అవకాశం ఇచ్చేలా కేజీబీవీల్లో సీట్లు పెంచాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పొగలు

● అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మూడు, నాలుగు రోజుల నుంచి పొగలు వస్తున్నప్పటికీ విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగలు వస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో భయాందోళనకు గురవుతున్నారు. సమస్య చిన్నదిగా ఉన్నప్పుడే పరిష్కరించాల్సిన అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

సాగునీరు విడుదల



గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాల్వ నుంచి ఆయకట్టుకు విడుదలవుతున్న సాగునీరు

కోడుమూరు రూరల్: గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాల్వ కింద సాగు చేసిన పంటలకు నీటి తడులు కట్టుకునేందుకు నీటిని విడుదల చేసినట్లు ఏఈ నారాయణ బుధవారం తెలిపారు. ఏఈ మాట్లాడుతూ ఎడమ కాల్వ కింద రైతులు సాగు చేసిన మొక్కజొన్న, కొర్ర వంటి పంటలకు నీటి తడుల కోసం 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని చెప్పారు. వేసవి దృష్ట్యా రైతులంతా నీటిని వృథా చేయకుండా పంటలను తడుపుకోవాలని కోరారు.